# లవ్ లెటర్ రైటింగ్ మేడీ ఈజీ (3)

## ప్రేమ లేఖలు వ్రాయుటకు సులభ పద్ధతి

శకుంతల తన మొట్ట మొదటి లవ్ లెటర్‌ను తామరాకు మీద గోటితో రాసింది.

"ఒరేయ్ దుష్యంతా [మెర్సిలెస్ ఫెలో—దయ మైనస్ గాకలవాడ] నా హోల్ బాడీ అంటే ప్రతి పార్టునూ డే అండ్ నైటన్న డిఫరెన్సేమీ లేకుండా మైమనస్ అనగా నా మైండ్ ఎంత క్రూరంగా ఘోరంగా రెచెడ్‌గా తపింప చేస్తోందో....యూ డోంట్నో....యూ ఫూల్ నీ కెంత మాత్రం తెలియదు." అని రాసిందండి ఇది తిట్టు కవిత్వంలాగుంది కాని ఇదేమి లవ్ లెటర్! తామరాకు మీద రాసిన ఉత్తరం ఆవిడ పోస్టు చేయ లేదు. అందుకే అది పోస్టు చేయని ప్రేమలేఖ నంబర్ వన్ క్రింద కొస్తుంది.

ఫోటోగ్రఫీలో నెగటివ్ పోజిటివ్ అని వున్నట్లు ప్రేమో గ్రఫీలో కూడా లవ్ మొదట నెగటివ్‌గా ప్రింటయి తరువాత పోజిటివ్‌గా పెళ్ళి పెటాకుల రూపం ధరించడం కద్దు. కొన్ని ప్రింట్లు పాడయిపోతాయి కొన్ని ఎక్సలెంటుగా వస్తాయి. కొందరి ప్రేమ ఫిలిం ఎక్స్‌పోజయినట్లు వెల వెల బోతుంది. ప్రేమికులకు అన్నీ నెగిటివ్ దృక్పథంలో కనిపిస్తాయి. మనస్సెటో పక్షిలా ఎగిరిపోతూ వుంటుంది. శరీరావయవాలన్నీ ఇండి

పెండెంట్లలా వాటిష్టమొచ్చినట్లు అవి వ్యవహరిస్తూ వుంటాయి. అలంకరణ మీద ఆసక్తి వుండదు. ఆహారం రుచించదు. నెచ్చెలులే గండ్రు పిల్లుల్లా కనిపిస్తారు. [దానికి మద వెక్కిపోయింది. వాడికి కామినీ పిశాచం పట్టుకుంది అంటారు. లోకులు. దానర్థమిదే) ప్రియుడు కాని ప్రియురాలు కాని చెంత లేనపుడు డన్‌లప్ పిల్లో మొగల్రాజపురం కొండలా వుంటుంది. డబుల్ బెడ్ క్షీరసాగర సముద్రంలా అనంత మై పోతుంది. ఇష్ట సఖీ సఖులతో శయ్యాగతులైనపుడు నులక మంచమే హంస తూలికా తల్పంపై పోతుంది. ఇష్టమైనపుడు ఎక్కడ గిల్లినా ఎక్కడ కొరికినా నఖక్షత దంతక్షతాదులలోకి వెళ్ళి అక్కవుంటయిపోతాయ్, లవ్వర్సుకి ఎడబాటులో సూర్యుడు అయిస్ ఫ్రూట్ అమ్మే కుర్రాడిలానూ, శీతమయూఖుడు కాల్తున్న అట్లపెనాంలానూ కనబడటంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే లవ్ లెటర్సు రాయడమంటే మాగాయి ముక్కేసుకుని చద్దన్నం కొట్టేయడం కాదు.

మొన్నీ మధ్య ఒక అమ్మడు పండగ పూటా పుట్టింట్లో వెండి కంచంలో సగ్గు బియ్యపు పరవాణం, పోస్తే వ్రేలితో కంచంలో తన మొగుడి పేరు రాస్తూ పరధ్యానగా కూర్చుందిట. అలా వెండి కంచంలో వేడి వేడి పరవాణ్ణంలో రాస్తూ కూర్చుంటే అందులో మొగుడి మొహం ముద్దుగా కనిపిస్తుందా ఏమిటి?

మొగుడి థాట్సు వచ్చి ముసురుకోగా ముద్ద నోటికెత్తని ఆడపిల్లను ఏమిటే అమ్మడూ—శకుంతలలాగ ఆలోచిస్తూ కూర్చున్నావ్ అంటారు. (ఆడాళ్ళని షేక్స్పియర్ మొహం పెట్టుకుని కూర్చున్నావ్ అన్రు ఆలోచిస్తూ—చింతాక్రాంతలై యున్న కాంతల మొహాలను శకుంతల మొహాలంటారు కాని షేక్స్పియర్ మొహాలని అన్రు.) కమింగ్ టు ది పాయింట్ — వెండికంచంమీది పరవాణ్ణంలో కూడా వేలితో పోస్టుచేయని ప్రేమలేఖను రాయొచ్చు. రారూ" —"రండి"—"ఎప్పుడొస్తారు?-" "అబ్బ

రండీ చప్పన"- అనే మాటలను "మైడియర్- "డార్లింగ్"- "ప్రాణ నాథా" "ప్రాణసఖా- "ప్రియమైన అయ్యా" ఇలాటి సంబోధనల్ని ప్రేలితో వెండి కంచంలో అమ్మడు రాయొచ్చు. లవ్ లెటర్స్ ముందస్తుగా రాయడం మొదలెట్టింది ఆడాశ్కె-ఫరెగ్జాంపుల్ సత్యభామ చూడండి కూచిపూడివారి భామాకలాపంలో సత్యభామ శ్రీకృష్ణస్వామి వారికి ఎక్స్టెపోర్‌గా ప్రేమలేఖను డికేట్ చేస్తుంది. సిద్ధాంద్రయోగిగారు దీనికి అసలు తయారుచేశారు. తెలుగులో ఒకటో రకం మోడల్ లవ్ లెటర్ అని చెప్పుకో తగిన సత్యభామ వ్రాసిన ప్రేమలేఖను ఒక యోగిగారు తయారు



చేశారు. ఆ లవ్ లెటర్‌కి కూచిపూడివారు ఒక వరస ఏర్పాటు చేశారు. అది ఓరియంటల్ స్టయిల్‌లో మంచి ప్రోజులో రాసిన ప్రణయ లేఖ- అది మా ఫ్రెండు మోతేవేదకుమారి చదవగా వినాలి. తింటే గారెలు

తినాలి అనట్లు. ఆవిడ పాటల పుస్తకంలో ఈ లవ్ లెటర్ కాపీచేసి పెట్టింది. నేనంటె నేనే! ఆవిడంత ఈజీగా పాడదు. కొంచెం గిల్లాలి. మీ మొహాలు చూస్తే పాడబుద్ధేయదు. గోడకేసి తిరిగి కూచుంటే పాడతాను అంటుంది. ఏం చేస్తాం గోడకేసి తిరిగి కూర్చుంటాం పాట కోసమైనా-

మోడల్ లవ్ లెటర్స్‌కి టెస్ట్ పెడతానన్నాను కదా. అట్ల తీసుకుని క్వశ్చన్స్ రాసుకోండి. సమయం 2 గంటలు. ఈ క్రింది ప్రశ్నలలో ఏ మూడు ప్రశ్నలకైనను సమాధానం వ్రాయవచ్చును. దస్తూరికి మంచి మార్కులు యివ్వబడును.

1. మండోదరి రావణాసురునికి వ్రాసినట్లు వివాహమునకు ముందు, వివాహమైన పిదప రెండు లేఖలను వ్రాయుము.

2. శూర్పణఖ తన విరహమును వ్యక్తము చేయుచూ 25 పంక్తులకు మించకుండా శ్రీరామునికి వ్రాసినట్లు ఒక ప్రణయలేఖను వ్రాయుము.

3. కర్ణుడు దుర్యోధనుడు యిద్దరూ (విడి విడిగా) ద్రౌపదికి వ్రాసినట్లు రెండు ప్రేమ లేఖలు క్లుప్తముగా వ్రాయుము.

4. బారిష్టరు పార్వతీశం మధురవాణికి వ్రాసినట్లు లేదా గిరీశం బుచ్చమ్మకు వ్రాసిన ఉత్తరం వివరిస్తూ అది భానుమతి అత్తగారి కంట పడగా ఆవిడ వ్యాఖ్యానములను విపులముగా వ్రాయునది.

(ఈ ప్రశ్న కంపల్సరీగా ఆన్సరు చేయాలి)

5. నీకు తెలిసిన ఇద్దరు ప్రఖ్యాత రచయిత్రులకు నీవు ప్రేమ లేఖలు వ్రాయగా వారు ఎడాపెడా వాయకొడుతూ వ్రాసిన జవాబుల వంటివి రెండు పదిపదిహేను పంక్తులలోపున వ్రాయుము.

(ఏ ప్రశ్నకైనా 25 మార్కులే. మొత్తం 75 మార్కుల పేపరు)

జవాబులు పై వారం నుంచీ వస్తాయి. ప్రేమికులకు సంబంధించిన ఇంటిలెక్కలు కూడా చెప్తాము అన్నట్లు మీ మట్టివినాయకుడుగారు-ఏం చేస్తున్నారు? మట్టి వినాయకుడు ఒక గ్లామర్ గరల్‌కు వ్రాసినట్లు ప్రఖ్యాత సినీతారకు ఒక ప్రేమలేక వ్రాయు. (చూచి కాపీకొట్టరాదు.) నోట్సుల నుంచీ గైడనుంచీ కాపీకొట్టినవారు పట్టుపడినచో మూడునుంచి ఐదు సంవత్సరముల వరకూ ప్రేమలేఖలు వ్రాయకుండా ప్రిన్సిపాల్ బహిష్కరించును.

ప్రిన్సిపాలెవరు? నేనే....